16-04-2015 ఉదయము మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనము

"మధురమైన పిల్లలారా - మీ ఉన్నతి కొరకు ప్రతి రోజూ లెక్కాచారము వ్రాయండి, రోజంతటిలో నడవడిక ఎలా ఉంది? యజ్ఞము పట్ల నిజాయితీ(హానెస్టీ)గా ఉన్నానా? అని పరిశీలించుకోండి."

ప్రశ్న:- ఏ పిల్లల పట్ల బాబాకు చాలా గౌరవముంది ? ఆ గౌరవానికి గుర్తులేవి ?

సమా :- ఏ పిల్లలైతే తండ్రితో సత్యముగా, యజ్ఞము పట్ల నిజాయితీగా ఉన్నారో, ఏదియూ దాచరో, ఆ పిల్లల పట్ల తండ్రికి చాలా గౌరవముంది. గౌరవమున్నందు వలన బుజ్జగించి ఉన్నతి చేస్తూ ఉంటారు. సేవ చేయుటకు కూడా పంపిస్తారు. కాని పిల్లలకు సత్యము వినిపించి శ్రీమతము తీసుకునే తెలివి ఉండాలి.

పాట: సభలో దీపము వెలిగింది....................(మెహఫిల్ మే జల్ ఉఠీ శమా)

ఓంశాంతి. ఈ పాట తప్పు, ఎందుకనగా మీరు దీపాలు కారు. వాస్తవానికి ఆత్మను దీపమని అనరు. భక్తులు అనేక పేర్లు పెట్టేశారు. తెలియనందువలన, నేతి-నేతి మాకు తెలియదు, (తెలియదు, కాదు-కాదు) అని అంటారు. అందరూ నాస్తికులే. అయినా ఏ పేరు నోటికి వస్తే ఆ పేరుతో పిలుస్తారు. బ్రహ్మను దీపమంటారు. అంతేకాక రాయి-రప్పలలో కూడా పరమాత్మ ఉన్నారని అనేస్తారు ఎందుకనగా భక్తిమార్గములో ఎవ్వరూ తండ్రిని యథార్థముగా తెలుసుకోలేరు. తండ్రే స్వయంగా వచ్చి తమ పరిచయమునివ్వవలసి వస్తుంది. శాస్త్రాలు వగైరా దేనిలో కూడా తండ్రి పరిచయము లేదు. అందువలన వారిని నాస్తికులని అంటారు. ఇప్పుడు పిల్లలకు తండ్రి స్వయంగా తమ పరిచయమునిచ్చారు, కాని స్వయమును ఆత్మగా భావించి తండ్రిని స్మృతి చేయుటలోనే బుద్ధికి పని (వివేకము) ఉంది. ఈ సమయములో అందరూ రాతి బుద్ధి గలవారిగా ఉన్నారు. బుద్ధి ఆత్మలో ఉంది. అవయవాల ద్వారా ఆత్మలోని బుద్ధి స్వచ్ఛముగా, బంగారు బుద్ధిగా ఉందా లేక రాతిబుద్ధిగా ఉందా? అని తెలుస్తుంది. ఆధారమంతా ఆత్మ పైననే ఉంది. మనుష్యులేమో ఆత్మనే పరమాత్మ అని, ఆత్మ నిర్లేపి అని కనుక ఏది కావాలంటే అది చేస్తూ ఉండండి అని చెప్తారు. మనుష్యులై ఉండి, తండ్రి ఎవరో తెలియదు. తండ్రి చెప్తున్నారు - మాయా రావణుడు అందరి బుద్ధిని రాతిబుద్ధిగా చేసేశాడు. రోజురోజుకు తమోప్రధానత ఎక్కువవుతూ ఉంది. మాయ జోరు ఎక్కువగా ఉంది. బాగుపడరు. రాత్రిపూట రోజంతటి లెక్కాచారమును చూచుకోండి - ఈ రోజు నేనేమి చేశాను? భోజనము దేవతల వలె తిన్నానా? నియమానుసారము నడుచుకున్నానా? లేక తెలివిహీనుల వలె నడుచుకున్నానా? ప్రతి రోజు మీ లెక్కాచారాన్ని సంభాళించుకోకుంటే (సరి చేసుకొనిచో) మీ ఉన్నతి ఎప్పుడూ జరగదు. చాలా మందిని మాయ చెంపదెబ్బలు కొడ్తూ ఉంటుంది. ఈ రోజు నా బుద్ధియోగము ఫలానావారి నామ-రూపాలలోకి వెళ్లింది, ఈ రోజు ఈ పాప కర్మ జరిగింది.............. ఇలా సత్యము వ్రాయువారు కోటిలో కొంతమంది మాత్రమే ఉన్నారు. తండ్రి చెప్తున్నారు - నేను ఎవరో, ఎలా ఉన్నానో అని నన్ను గురించి తెలియనే తెలియదు. స్వయమును ఆత్మగా భావించి తండ్రిని స్మృతి చేసినప్పుడే కొంతైనా బుద్ధిలో కూర్చుంటుంది. తండ్రి చెప్తున్నారు - భలే చాలా మంచి-మంచి పిల్లలున్నారు, జ్ఞానము చాలా బాగా వినిపిస్తారు. కానీ యోగము కొంచెమైనా లేదు. నా గుర్తింపు లేనే లేదు. అర్థము చేసుకోలేరు. అందుకే ఎవ్వరికీ తెలుపలేరు. ప్రపంచములోని మనుష్యులెవ్వరికీ, రచయిత-రచనల గురించి తెలియనే తెలియదు అనగా ఏమియూ తెలుసుకోనట్లే,

ఇది కూడా డ్రామాలో నిర్ణయమయ్యే ఉన్నది. మరలా ఇలాగే జరుగుతుంది. 5 వేల సంవత్సరాల తర్వాత మరలా ఈ సమయము వస్తుంది. నేను వచ్చి మరలా తెలియజేయవలసి వస్తుంది. రాజ్యాధికారము తీసుకొనుట చిన్న విషయము కాదు. చాలా కష్టము. మాయ చాలా దాడి చేస్తుంది. యుద్ధము చాలా జరుగుతుంది. మల్లయుద్ధము (బాక్సింగ్) చూశారు కదా. చాలా తెలివిగల వారే మల్లయుద్ధము చేస్తారు. అయినా అందులో ఒకరినొకరు స్మృహ తప్పునట్లు మల్లయుద్ధము చేస్తారు కదా. బాబా! మాయ తుఫానులు చాలా వస్తున్నాయని చెప్తారు. ఇలా సత్యము వ్రాసేవారు కూడా చాలా కొద్దిమంది మాత్రమే. దాచి పెట్టుకునే వారు చాలా మంది ఉన్నారు. నేను బాబాకు సత్యమునెలా వినిపించాలి? ఏ శ్రీమతము తీసుకోవాలి? అను తెలివే లేదు. వర్ణించలేరు. మాయ చాలా శక్తివంతమైనదని తండ్రికి తెలుసు. సత్యము చెప్పుటకు చాలా సిగ్గుపడతారు. వారి ద్వారా ఎటువంటి కర్మలు జరుగుతాయంటే అవి తెలుపుటకు వారు సిగ్గుపడతారు. తండ్రి ఏమో చాలా గౌరవిస్తూ వారిని పైకి ఎత్తుతారు(ఉన్నతి చేస్తారు). వీరు ఎంతో మంచివారు, వీరిని ఆల్‌రౌండు సేవకు పంపుతానని అంటారు. ఈ మాటలు విని దేహ-అహంకారము వస్తే , మాయతో చెంపదెబ్బ తింటారు, క్రింద పడిపోతారు, బాబా వారిని లేవనెత్తుటకు మహిమ కూడా చేస్తారు. మీరు చాలా మంచి పిల్లలు, స్థూల సేవ కూడా బాగా చేస్తారు అని బుజ్జగించి పైకి లేవనెత్తుతారు. కానీ గమ్యము చాలా గొప్పదని యథార్థము తెలుపుచున్నారు. దేహము, దేహ సంబంధములన్నీ వదిలి స్వయంను అశరీరి ఆత్మగా భావించండి - ఈ పురుషార్థము బుద్ధి చేసే పని. అందరు పురుషార్థులే. ఎంత గొప్ప సామ్రాజ్యము స్థాపనవుతూ ఉంది! తండ్రికి అందరూ పిల్లలే కాక విద్యార్థులు కూడా. అంతేకాక అనుచరులు (ఫాలోయర్స్) కూడా, వీరు ప్రపంచానికంతా తండ్రి. అందరూ వారినొక్కరినే పిలుస్తారు. వారు వచ్చి పిల్లలకు తెలియజేస్తూ ఉంటారు. అయినా వారి పై అంత గౌరవముండదు. పెద్దవారు వచ్చినప్పుడు వారికెంతో గౌరవమిచ్చి వారిని సంభాళన చేస్తారు. వారికి ఎంతో ఆడంబరముంటుంది. ఈ సమయములో అందరూ పతితులే. కాని స్వయంను పతితులుగా భావించరు. మాయ పూర్తిగా తుచ్ఛబుద్ధిగా తయారు చేసేసింది. సత్యయుగ ఆయువు చాలా ఎక్కువని చెప్తారు. ఇది వంద శాతము బుద్ధిహీనత అని తండ్రి చెప్తారు. మనుష్యులై ఎలాంటి కర్మలు చేస్తారో చూడండి. 5 వేల సంవత్సరాలకు బదులు లక్షల సంవత్సరాలని చెప్పేశారు. ఇది కూడా తండ్రి వచ్చి తెలియజేస్తున్నారు. 5 వేల సంవత్సరముల క్రితము ఈ లక్ష్మీనారాయణుల రాజ్యముండేది. వారు కూడా మనుష్యులే. అయితే దైవీగుణముగలవారు. కనుక వారిని దేవతలని అంటారు. ఆసురీ గుణములు గలవారిని అసురులని అంటారు. అసురులకు దేవతలకు రాత్రికి పగలుకున్నంత తేడా ఉంది. ఎన్ని మారణహోమాలు, కొట్లాటలు జరుగుచున్నాయి! అనేక ఆయుధాలు తయారవుతూ ఉంటాయి. ఈ యజ్ఞములో ప్రపంచమంతా స్వాహా అవుతుంది. దీని కొరకు ఈ ఏర్పాట్లన్నీ కావాలి కదా. బాంబులు తయారవుతున్నాయి, దానిని వేయకుండా ఊరకే పెట్టుకుంటారా? కొద్ది సమయములోనే అందరి వద్దా ఎన్నో లెక్కలేనన్ని బాంబులు తయారైపోతాయి. ఎందుకనగా వినాశనము వేగతరముగా(ఫటాఫట్‌గా) జరగాలి కదా. అప్పుడు ఆసుపత్రులు మొదలైనవేవీ ఉండవు. ఎవ్వరికీ అర్థము కూడా కాదు. పిన్నమ్మ ఇల్లేమీ కాదు. వినాశనము, సాక్షాత్కారముల విషయము అల్పమైనది కాదు. పూర్తి ప్రపంచానికి అంటుకునే అగ్నిని మీరు చూస్తారు. ఎక్కడ చూసినా అగ్నియే అగ్ని ఉంటుంది. ఇది ఎంత పెద్ద ప్రపంచము. ప్రపంచమంతా సమాప్తమైపోతుంది. ఆకాశము మాత్రము కాలిపోదు.

దీనిలో ఏమేమి ఉందో అంతా వినాశనమైపోతుంది. సత్యయుగానికి కలియుగానికి రాత్రికి-పగలుకున్నంత వ్యత్యాసముంది. లెక్కలేనంతమంది మనుష్యులున్నారు, జంతువులున్నాయి. ఎంత సామగ్రి ఉంది! ఇది కూడా పిల్లల బుద్ధిలో కూర్చొనుట కష్టము. ఇది 5 వేల సంవత్సరములనాటి విషయము కొద్దిగా ఆలోచించండి. దేవీ దేవతల రాజ్యముండేది కదా. అప్పుడు చాలా కొద్ది మందే మనుష్యులుండేవారు. ఇప్పుడెంతమంది మనుష్యులున్నారు! ఇది కలియుగము. ఇప్పుడిది తప్పక వినాశనమవుతుంది.

ఇప్పుడు తండ్రి ఆత్మలకు చెప్తున్నారు - నన్ను ఒక్కరినే స్మృతి చేయండి (మామేకం యాద్‌కరో) ఇది కూడా జ్ఞానయుక్తముగా అర్థము చేసుకొని స్మృతి చేయాలి. కేవలము శివ-శివ అని చాలా మంది అంటూ ఉంటారు. చిన్న పిల్లలు కూడా అంటారు. కాని బుద్ధిలో జ్ఞానము ఏమాత్రము ఉండదు. వారు బిందువని అనుభవముతో చెప్పరు. ఊరకే అంటారు. మనము కూడా చాలా చిన్న బిందువులమే. ఇలా అర్థము చేసుకొని జ్ఞానయుక్తముగా స్మృతి చేయాలి. మొదట నేను ఆత్మను అని పక్కా చేసుకోండి. తర్వాత తండ్రి పరిచయమును బుద్ధిలో మంచి రీతిగా ధారణ చేయండి. అంతర్ముఖులుగా ఉన్న పిల్లలే మేము ఆత్మలము, బిందువులము అని బాగా అర్థము చేసుకోగలరు. మన ఆత్మలకు మనలో 84 జన్మల పాత్ర ఎలా నిండి ఉందో, మరలా ఆత్మ సతోప్రధానముగా ఎలా అవుతుందో ఇప్పుడా జ్ఞానము లభిస్తూ ఉంది. ఇవన్నీ చాలా అంతర్ముఖులుగా ఉండి అర్థము చేసుకునే విషయాలు. ఇందులోనే సమయము పడ్తుంది. ఇది మన అంతిమ జన్మ అని పిల్లలకు తెలుసు. ఇప్పుడు మనము మన ఇంటికి వాపసు వెళ్తాము. మనము ఆత్మలము అని బుద్ధిలో పక్కాగా ఉండాలి. శరీర స్మృతి తక్కువగా ఉన్నపుడే మట్లాడే తీరులో పరివర్తన కలుగుతుంది. లేనిచో నడవడిక ఇంకా పూర్తిగా చెడిపోతుంది. నీచంగా తయారవుతుంది. ఎందుకనగా శరీరము నుండి వేరుగా కారు. దేహాభిమానములోకి వచ్చి ఏదో ఒకటి అనేస్తారు. యజ్ఞములో చాలా నిజాయితీగా ఉండాలి. ఇప్పుడింకా చాలా నిర్లక్ష్యముగా ఉన్నారు. ఆహారపానీయాలు, వాతావరణము కొంచెమైనా చక్కబడలేదు. ఇంకా చాలా సమయము పడ్తుంది. సేవాధారులైన పిల్లలనే బాబా స్మృతి చేస్తారు. పదవి కూడా వారే పొందుకోగలరు. స్వయమును సంతోషపరచుకొనుట, కేవలము శెనగలు తినినట్లవుతుంది. ఇందులో చాలా అంతర్ముఖులుగా ఉండాలి. ఇతరులకు తెలియజేసే యుక్తి కూడా కావాలి. ప్రదర్శినీలో అందరూ అర్థము చేసుకోలేరు. కేవలము మీ మాటలు బాగున్నాయని అంటారు. ఇక్కడ కూడా మనము తండ్రి పిల్లలమయ్యాము, తండ్రి నుండి స్వర్గ వారసత్వము పొందుకుంటామని నిశ్చయమున్నవారు నంబరువారుగా ఉన్నారు. మనము సేవ పూర్తిగా చేస్తూ ఉండాలి. మన పని ఇదే. రోజంతా విచార సాగర మథనము జరుగుతూ ఉంటుంది. ఈ బాబా కూడా విచార సాగర మథనము చేస్తూ ఉంటారు కదా లేకుంటే ఈ పదవి(లక్ష్మీనారాయణుల)నెలా పొందుకుంటారు? పిల్లలకు ఇరువురు (బాప్‌దాదా) కలిసి అర్థము చేయిస్తూ ఉంటారు. రెండు ఇంజన్లు లభించాయి. ఎందుకంటే ఎత్తు చాలా ఉంది కదా. పర్వతాల పైకి వెళ్తున్నప్పుడు రైలు బండికి రెండు ఇంజన్లు తగిలిస్తారు. అప్పుడప్పుడు వెళ్తూ వెళ్తూ రైలుబండి ఆగిపోతుంది. అప్పుడు జారి క్రిందికి వస్తుంది. పిల్లలైన మన పురుషార్థము కూడా అలా ఉంది. ఉన్నతి చెందుతూ-చెందుతూ శ్రమ చేస్తూ-చేస్తూ పైకి ఎక్కలేరు. మాయా గ్రహణము లేక తుఫాను వస్తూనే పూర్తిగా క్రిందపడిపోయి పిండి పిండి అయిపోతారు. కొంచెము సేవ చేసిన వెంటనే అహంకారమొచ్చి క్రింద పడిపోతారు. వారు

తండ్రేకాక, ధర్మరాజు కూడా అని మర్చిపోతారు. అటువంటివేమైనా చేస్తే మనకు పెద్ద శిక్షపడ్తుందని మర్చిపోతారు. దీనికంటే వెలుపల ఉండుట మంచిది. తండ్రివారమై వారసత్వము తీసుకొనుట పిన్నమ్మ ఇల్లు కాదు(అంత సులభము కాదు). తండ్రి వారై మళ్లీ అలాంటి పనులు చేస్తే తండ్రి పేరును చెడగొడ్తారు(అవమాన పరుస్తారు). చాలా పెద్ద దెబ్బ తగులుతుంది. వారసులగుట సులభము కాదు. ప్రజలలో కొంతమంది ఎంత ధనవంతులుగా అవుతారంటే అడగకండి. అజ్ఞాన కాలములో కొంతమంది మంచివారుగా ఉంటారు, కొంతమంది చెడుగా ఉంటారు. అయోగ్య పిల్లలను నా ఎదుట నుండి తొలగిపో, నీ ముఖము చూపించకు అని లౌకిక తండ్రి కూడా అంటాడు. ఇచ్చట ఒకరిద్దరి పిల్లల మాట కాదు. ఇచ్చట మాయ చాలా శక్తివంతముగా ఉంది. ఇందులో పిల్లలు చాలా అంతర్ముఖులుగా ఉండాలి. అప్పుడు మీరు ఎవరికైనా తెలియజేయగలరు. అందరూ మీ పై బలిహారమవుతారు. మేము తండ్రిని ఇంతగా తిడ్తూ వచ్చామని చాలా పశ్చాత్తాపపడతారు. సర్వవ్యాపి అనుట లేక స్వయమును ఈశ్వరుడని అనేవారికి తక్కువ శిక్షలు పడవు. అలాగే ఇంటికి పోలేరు. వారికింకా చాలా కష్టాలు ఉంటాయి. సమయము వచ్చినపుడు తండ్రి వీరందరితో లెక్క తీసుకుంటారు. వినాశన సమయములో అందరి లెక్కాచారము చుక్తా అవుతుంది కదా. ఇందులో బుద్ధి చాలా విశాలముగా ఉండాలి.

మనుష్యులు ఎవరెవరికో శాంతి బహుమతులనిస్తూ ఉంటారు. వాస్తవానికి శాంతిస్థాపన చేయువారు ఒక్కరే కదా. ప్రపంచములో పవిత్రత-శాంతి-సుఖములు భగవంతుని శ్రీమతమనుసారము స్థాపనవుతూ ఉన్నవని పిల్లలు వ్రాయాలి. శ్రీమతము ప్రసిద్ధి చెందింది. శ్రీమద్భగవద్గీతా శాస్త్రానికి ఎంతో గౌరవమిస్తారు. ఎవరైనా ఎవరి శాస్త్రమును గాని, మందిరమును గాని ఏమైనా చేస్తే ఎంతగా కొట్లాడ్తారు. ఇప్పుడీ ప్రపంచమంతా కాలి భస్మమైపోతుందని మీకు తెలుసు. ఈ మందిరాలు - మసీదులు మొదలైనవాటిని తగులబెట్టూ ఉంటారు. ఇవన్ని జరగక ముందే పవిత్రముగా అవ్వాలి. సదా ఈ చింత ఉండాలి. ఇల్లు-వాకిళ్లను కూడా సంభాళించుకోవాలి. ఇచ్చటికి చాలా మంది వస్తారు. ఇక్కడ మేకల వలె ఉంచుకోరాదు, ఎందుకనగా ఇది అమూల్యమైన జీవితము. వీరిని చాలా జాగ్రత్తగా చూచుకోవాలి. పిల్లలు మొదలైన వారిని తీసుకొని రాకూడదు. ఇంతమంది పిల్లలను ఎక్కడుంచి సంభాళిస్తారు? పిల్లలకు శెలవులు వస్తే ఎక్కడికైనా పోతే బాగుంటుందని భావిస్తారు. బాబా వద్దకు మధువనానికి పోతామని అనుకుంటారు. ఇది సత్రము వలె అయిపోతుంది. అప్పుడు దీనిని యూనివర్సిటీ అని ఎలా అనాలి! బాబా అంతా పరిశీలిస్తున్నారు. ఎప్పుడూ ఎవ్వరూ పిల్లలను తీసుకొని రాకండని ఆర్డరు వేస్తారు. ఈ బంధనము కూడా తగ్గిపోతుంది. మాతల పై జాలి కలుగుతుంది. శివబాబా గుప్తముగా ఉన్నారని కూడా పిల్లలకు తెలుసు. ఇతని పై కూడా కొంతమందికి గౌరవము లేదు. మాకు శివబాబాతో సంబంధముంది కదా? అని భావిస్తారు. వీరి ద్వారా చెప్పేది శివబాబా ఇతని ద్వారా చెప్తున్నారని కూడా భావించరు. మాయ ముక్కుతో పట్టుకొని తప్పుడు పనులు చేయిస్తూ ఉంటుంది. వదలనే వదలదు. రాజధానిలో అందరూ కావాలి కదా. ఇవన్నీ చివర్లో సాక్షాత్కారమవుతాయి. శిక్షల సాక్షాత్కారము కూడా అవుతుంది. పిల్లలకు మొదలే ఇవన్నీ సాక్షాత్కారాలయ్యాయి. అయినా ఏదో ఒక పాప కర్మ చేయుటను వదలి పెట్టరు. చాలా మంది పిల్లలు, మేము మూడవ తరగతికి చెందినవారిగానే తయారవుతామని కంకణము

కట్టుకున్నట్లున్నారు. అందువలన పాపకర్మలు చేయుట మాననే మానరు. వారి శిక్షలను వారే ఇంకా మంచి రీతిగా తయారు చేసుకుంటున్నారు. అయితే వారికి తెలపవలసి వస్తుంది కదా , మేము ధర్డ్‌క్లాసు వారిగానే తయారవుతాము అని కంకణము కట్టుకోకండి. ఇప్పుడు మేము ఈ లక్ష్మీ-నారాయణులుగా కావాలని ప్రతిజ్ఞ చేయండి. కొంతమంది మంచి కంకణము కట్టుకుంటారు. ఈరోజు మేము ఏ పాప కర్మ చేయలేదు అని చార్టు వ్రాస్తారు. చాలా మంది ఇటువంటి చార్టు కూడా వ్రాసేవారు. వారు ఈ రోజు లేనే లేరు. మాయ చాలా సతాయిస్తుంది, ఓడిస్తుంది. అర్ధకల్పము నేను సుఖమిస్తాను. అర్ధకల్పము మాయ దుఃఖమిస్తుంది. మంచిది.

మధురాతి మధురమైన ఆత్మిక పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము :-

1) అంతర్ముఖులై శరీర భావమునకు అతీతముగా ఉండే అభ్యాసము చేయాలి. ఆహార-పానీయాలు, నడవడికలు చక్కదిద్దుకోవాలి. కేవలము స్వయాన్ని సంతోషపరచుకొని నిర్లక్ష్యముగా ఉండరాదు.

2) చాలా ఎత్తుకుపోవాలి కనుక చాలా-చాలా జాగ్రత్తగా హెచ్చరికగా వెళ్లాలి. ఏ కర్మనైనా చాలా హెచ్చరికతో చేయాలి అహంకారముండరాదు. వ్యతిరేక(ఉల్టా) కర్మలు చేస్తూ శిక్షలను తయారు చేసుకోరాదు. మేము ఈ లక్ష్మీనారాయణుల వలె తయారయ్యే తీరాలి అని కంకణము కట్టుకోవాలి (ప్రతిజ్ఞ చేసుకోవాలి).

వరదానము :- " సంపన్నత ద్వారా సంతుష్టతను (తృప్తిని) అనుభవము చేయు సదా హర్షిత్ విజయీ భవ "

ఎవరైతే సర్వ ఖజానాలతో సంపన్నముగా ఉంటారో వారే సదా తృప్తిగా ఉంటారు. సంతుష్టత అనగా సంపన్నత. తండ్రి సంపన్నముగా ఉన్నారు కనుక వారిని సాగరమని మహిమ చేస్తారు. అలా పిల్లలైన మీరు కూడా మాస్టర్ సాగరులు అనగా సంపన్నులుగా అయితే సదా సంతోషంగా నాట్యము చేస్తూ ఉంటారు. సంతోషము తప్ప ఇంకేదియూ రాదు. స్వయం సంపన్నంగా ఉండుట వలన ఎవరితోనూ విసిగింపబడరు. వారికి ఏ విధమైన చిక్కులు గాని, విఘ్నాలు గాని ఒక ఆట వలె అనుభవమవుతుంది. సమస్యలు మనసును రంజింపజేసే సాధనాలుగా అవుతాయి. నిశ్చయబుద్ధిగా ఉండుట వలన సదా హర్షితంగా, విజయులుగా ఉంటారు.

స్లోగన్ :- " నాజూకు పరిస్థితుల ద్వారా భయపడకండి. వాటి నుండి పాఠము నేర్చుకొని స్వయాన్ని పరిపక్వము చేసుకోండి."